తొలి రోజే తిప్పలు

- పింఛన్ల పంపిణీకి సర్వర్ సమస్య
- ప్రారంభమైన కొద్ది సేపటికే మొరాయింపు
- సుమారు రెండు గంటల పాటు ఇబ్బంది
- లబ్ధిదారుల చిరునామాలు తెలియక కార్యదర్శులకు అవస్థలు

సీతంపేట: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. తొలి రోజే పింఛన్ల పంపిణీకి తిప్పలు తప్పలేదు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పెన్షన్ల పంపిణీ ఒకవైపు వర్షం.. మరో వైపు సర్వర్ మొరాయింపుతో చాలా మంద కొడిగా జరిగింది. ఉదయం సుమారు రెండు గంటల పాటు సర్వర్ మొరాయించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసేవారు. ఇప్పుడు లబ్ధిదారుల ఇళ్లు తెలియక సచివాలయ కార్యదర్శులు చాలా ఇబ్బంది పడ్డారు. లబ్ధిదారులకు ఫోన్లు చేసి ఇళ్లు కనుక్కొని పంపిణీ చేయాల్సి వచ్చింది.

పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే

44వ వార్డు ఎంటీసీ పాలెంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఇంటింటికీ వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచి రూ.1,000 చొప్పున పెంచిన దాంతో కలిపి రూ.7 వేలు చొప్పున పెన్షన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏపీడీ పద్మావతి, జనసేన నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కొయిలాడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎంటీసీ పాలెంలో లబ్ధిదారుకు పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

26వ వార్డు అక్కయ్యపాలెంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు.

జోన్–5లో..

జీవీఎంసీ జోన్–5 పరిధిలో సోమవారం 94.35 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని ఏపీడీ పద్మావతి తెలిపారు. మొత్తం 27,427 లబ్ధిదారులు ఉండగా.. 25,882 మందికి పెన్షన్లు సచివాలయ కార్యదర్శుల ద్వారా ఇంటి వద్దే అంజేసినట్టు చెప్పారు. ఈ నెల 5 వరకు పెన్షన్లు ఇస్తామని, తీసుకోని వారు, ఊళ్లు వెళ్లిన వారు వెల్ఫేర్ సెక్రటరీకి ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి పెన్షన్ డబ్బులు అందజేస్తారన్నారు.

సచివాలయం వద్ద బారులు

మద్రిపాలెం: ఈ నెల నుంచి ఇంటి వద్దకే పెన్షన్ వస్తుందని లబ్ధిదారులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. తీరా చూస్తే సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి కొందరికి తప్పలేదు. 53వ వార్డు మద్రిపాలెంలో లబ్ధిదారులకు స్పష్టత లేకపోవడంతో గ్రీన్ గార్డెన్స్ సచివాలయం వద్ద సోమవారం ఉదయం బారులు తీరారు. కొంతమంది నాయకులు వచ్చి పెన్షన్ ఇస్తున్నట్టు ఫొటో తీసుకుని వెళ్లిపోయారని వారు చెప్పారు. తర్వాత సర్వర్ పనిచేయక పోవడంతో సమస్య ఏర్పడిందని పింఛన్ పొందలేని వారు సచివాలయానికి రావాలని సూచించినట్టు పలువురు లబ్ధిదారులు తెలిపారు. చేసేది లేక వర్షానికి సైతం లెక్క చేయకుండా అక్కడకు వెళ్లారు. 49, 50 వార్డుల్లో పలు చోట్ల సర్వర్ మొరాయించడంతో ఆలస్యంగా పింఛన్ల పంపిణీ జరిగింది. ఇది తెలియక సచివాలయాలని వెళ్లినట్టు కొందరు లబ్ధిదారులు తెలిపారు.

మొరాయించిన సర్వర్

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు అల్లూరి సీతారామరాజు నగర్‌లో కార్పొరేటర్ గంకల కవిత నేతృత్వంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. వర్షానికి లబ్ధిదారులు ఇబ్బంది పడుతూ కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్నారు. అందరికీ ఒకే దగ్గర పింఛన్లు ఇవ్వడం, సర్వర్ పనిచేయకపోవడంతో గంటల సమయం వృథా అయ్యిందని పలువురు లబ్ధిదారులు వాపోయారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసిన స్వామీజీ


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు చిత్రపటం అందిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి స్వామి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును సాధు పరిషత్ శ్రీనివాసానంద సరస్వతి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్ది సేపు ఆయనతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేకు స్వామీజీ సింహాచలం అప్పన్న చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దేవాలయాలను పరిరక్షించుకోవాలని కోరారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

5న 'శతాక్షి కవితల సంపుటి' పుస్తకావిష్కరణ

సీతంపేట: అరసం విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో కవి, ఆకాశవాణి పూర్వపు కార్యక్రమాధిపతి రొక్కం కామేశ్వరరావు రచించిన 'శతాక్షి కవితల సంపుటి' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా పుస్తకావిష్కరణ, కె.జి.వేణు పుస్తక సమీక్ష చేస్తారని చెప్పారు. కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలిక అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కర్రి అఖిల అనే బాలిక విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని ఎంజేపీ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుకుంటుంది. తల్లి దండ్రులు కైలాసపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ఎదురుగా నీలకంఠనగర్‌లో నివసిస్తున్నారు. బాలిక వేసవి సెలవలకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. జూన్ 13న వేసవి సెలవలు ముగిసినా అనారోగ్యం కారణంగా ఆ సమయానికి హాస్టల్‌కు వెళ్లలేదు. గత 29న వెళ్లేందుకు సిద్ధమైంది. కుమార్తెను దింపేందుకు తల్లి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి అఖిల ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల అంతటా వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో అఖిల తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ వి.వి.రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో నుంచి వెళ్లే సమయానికి బాలిక ఆకుపచ్చ రంగు ఫ్యాంట్, టాప్ ధరించి ఉంది. నాలుగున్నర అడుగుల ఎత్తు, తెలుపు రంగు చాయ కలిగి, బాలిక మెడలో తాయత్తు, కాళ్లకు పట్టీలు ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ ప్రత్యేక పూజ జరగనుంది.

ఘనంగా మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు


మేడపాటి కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఎండీ రమేష్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్లు

సీతమ్మధార: స్వాతి ప్రమోటర్స్ సంస్థ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సీతమ్మధారలోని సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ మేడపాటి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం కృష్ణారెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి సంస్థ డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎండీతోపాటు డైరెక్టర్లు కలిసి చైర్మన్‌కు రాముడు, లక్ష్మణుడు, సీత విగ్రహాన్ని బహూకరించారు.

సేవా సారధి బుచ్చయ్యకు ఘన సత్కారం


వాకర్స్ ఉద్యమ కర్త బుచ్చయ్య


నిమ్మగడ్డ బుచ్చయ్యను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వాకర్స్ ఉద్యమం పేరు చెప్పగానే మురళీనగర్‌కు చెందిన నిమ్మగడ్డ బుచ్చయ్య గుర్తుకు వస్తారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడే కాకుండా వైశాఖి స్పోర్ట్స్ పార్కు వ్యవస్థాపకుడిగా, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడిగా గుర్తింపు పొందిన ఆయన సోమవారం నాటికి 90 ఏళ్లు పూర్తి చేసుకుని 91వ వసంతంలోకి అడుగు పెట్టారు. ఇప్పటికీ ఆయన వాకర్స్ పార్కులో ఇతర వాకర్స్‌తో నడక సాగించడమే కాకుండా క్లబ్ నిర్వహించే అన్ని సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొని విజయవంతం చేస్తున్నారు. వాకర్స్ క్లబ్ అనుబంధంగా ఏర్పాటు చేసిన పుస్తకాలయానికి బుచ్చయ్య గ్రంథాలయాధికారిగా ఉదయం, సాయంత్రం పనిచేస్తుంటారు. వాకర్స్ వాయిస్ వ్యవస్థాపక ఎడిటర్‌గా ఆయన తన సందేశాలను వాకర్స్‌కు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నిమ్మగడ్డ బుచ్చయ్యను సభ్యులు ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవితం గడపడంతోపాటు నియమితమైన సంపూర్ణ ఆహారం తీసుకోవడం, ప్రతి రోజూ క్రమం తప్పకుండా నడవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సభ్యులకు సూచించారు. మన శరీరాన్ని నిత్యం చురుగ్గా ఉంచుకోవాలంటే వయసుతో నిమిత్తం లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు ఆర్.సత్యనాథం, సత్తి సునీల్‌రెడ్డి, కె.ద్వారకానాథ్, భాస్కరరావు, మహిళా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వనితల ఆరోగ్యంతోనే కుటుంబ సౌభాగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ అనూష

మురళీనగర్: వనితలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష కంటిమహంతి అన్నారు. వనితా వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం నడకతోపాటు యోగా చేయాలని సూచించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఇంటిలో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. మెనోపాజ్ సమయంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. డాక్టర్ అనూషను సభ్యులు సత్కరంచారు. ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్–101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, పూర్వ కార్యదర్శి డి.జోష్న, సుధ, జాలీ వాకర్ ఎం.ప్రమీలారావు, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి జి.షీలారాణి, బులిటిన్ ఎడిటర్ ఆర్.స్నేహలత, జాయింట్ సెక్రటరీ ఆర్.రత్నకుమారి, జి.శిరీషలత పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 12 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న అర్బన్ తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామమూర్తి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, ఆర్ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలి

సీతమ్మధార: వాహన చోదకులందరూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని ద్వారకా జోన్ ట్రాఫిక్ ఎస్ఐ.భాస్కరావు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు ఎటువంటి వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. 18 ఏళ్లు నిండిన తరువాత లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలన్నారు. ఆటోలో ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించరాదని, సిగ్నల్ పాయింట్ వద్ద రెడ్ సిగ్నల్ పడితే రోడ్డు దాటరాదని, గ్రీన్ లైట్ వెలిగితే వెళ్లాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉండాలన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

మైనర్లు ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓం ఫ్రీ యోగా వ్యవస్థాపకుడు రమేష్‌కు గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమేష్

ఎంవీపీ కాలనీ: ఓం ఫ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. యోగాలో చేస్తున్న విస్తృత సేవలకు గాను న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆ యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్టు పేర్కొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓం ఫ్రీ యోగా సెంటర్‌కు 'యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్'లభించిందన్నారు. గత 11 ఏళ్లుగా విశాఖ వాసులకు యోగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. యూట్యూబ్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న రమేష్‌కు పలువురు నగర ప్రముఖులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

మెగా వైద్య శిబిరం


వైద్యులను సత్కరిస్తున్న మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్ సమీపంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అవతార్ మెహర్ బాబా ధ్యాన మందిరంలో ఏబీ మెడికల్ సర్వీసెస్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత వాసులకు డయాబెటిస్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా డయాబెటిస్, కాల్షియం, బీపీ మందులను అందజేశారు. గైనకాలజీ, నేత్ర వైద్య, జనరల్ వైద్య సేవలను అందించారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న వైద్యులను మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వినీల మేడపాటి(గైనకాలజిస్ట్), డాక్టర్ బి.బాలకృష్ణ(నేత్ర వైద్య నిపుణుడు) డాక్టర్ యడ్ల దిలీప్‌రాజా(కీళ్ల వ్యాధుల నిపుణుడు/జనరల్ ఫిజీషియన్), వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కె.ద్వారకానాథ్, మాధవి, శిరీష, శేషమణి, సిహెచ్.లక్ష్మి, కమల, వరలక్ష్మి, జాలీ వాకర్ మాధవీలత, సుగుణ, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్య ల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు అర్జీలను జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఏపీడీలు కమలావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సీతంపేట: అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విజ్ఞప్తి చేశారు. శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో సోమవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల కార్యవర్గ సమావేశం జరిగింది. జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని, సంబంధిత దరఖాస్తులను కూడా జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేశారని గుర్తు చేశారు. అది కార్యరూపం దాల్చలేదన్నారు. కూటమి మళ్లీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ నెల 13న అర్బన్ యూనిట్ కార్యవర్గ ఎన్నికలు, బ్రాడ్‌కాస్ట్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు శ్రీనుబాబు తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు జి.శ్రీనివాసరావు, ఏపీబీజేఏ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఈరోతి ఈశ్వరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, పితాని ప్రసాదరావు, ఎన్.రామకృష్ణ, ఎ.సాంబశివరావు, కె.ఎస్.శర్మ, బి.ఆనంద్, టి.కృష్ణమూర్తి, పి.నగేష్‌బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగిద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. తన బంగ్లా నుంచి సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం దానిని అమలు చేస్తున్నామన్నారు. ఏకో వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అతిసారతో ఒక్కరూ చనిపోరాదు

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అతిసారతో ఒక్కరూ చనిపోరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొబ్బరితోట వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసార వ్యాధిని ఎలా గుర్తించాలి..?, ఎలా నివారించాలో..? తెలియజేశారు. వాంతులు, విరేచనాలు సంభవించినప్పుడు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం, చేతులు శుభ్రంగా ఉంచడం, వ్యాధి నిరోధక టీకాలు తరచూ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కె.పద్మావతి, కె.నాగరాజు, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్, వివిధ విభాగాల డాక్టర్లు ఎస్.జీవన రాణి (జిల్లా టీకాల అధికారి), డాక్టర్ బి.ఉమావతి (నోడల్ అధికారి), జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వర రావు, డీపీవో శశిభూషణ్, శ్రీలత, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న డీఎం హెచ్‌వో జగదీశ్వరరావు

ఫోర్త్‌టౌన్ క్రైం పీఎస్‌కు మరమ్మతులు


క్రైం పోలీస్ స్టేషన్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మలు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌పై రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. స్టేషన్ పైభాగం కొంత మేరకు దెబ్బతింది. దీంతో సోమవారం పోలీస్ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వచ్చి పడిన చెట్టు కొమ్మలను తొలగించి మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. స్టేషన్ పైభాగాన సిమెంట్ రేకు కొంత భాగం విరిగిపోవడంతో ప్లాస్టిక్ పరదా వేశారు. ఈ పనులను అధికారులు అంచనా వేసి పూర్తి చేయనున్నారు.

ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ

సీతమ్మధార: డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుందని, దీని నివారణ కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సహకారం లేకపోతే దోమల నివారణ సాధ్యం కాదన్నారు. డెంగ్యూ మీద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పగటి పూట కుట్టే దోమాల ద్వారా మాత్రమే డెంగ్యూ వ్యాధి సోకుతుందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ, జిల్లా మలేరియా అధికారి తులసిరాజ్, బి.నాగేశ్వరరావు, శశిభూషణ్, నాగభూషణం, వైద్య ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ

అల్లిపురం: రైల్వే స్టేషన్లో భిక్షాటన చేసుకుంట న్న మహిళకు ఆశ్రయం కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు ఏయూటీడీ సిబ్బంది. వివరాలివి.. లక్ష్మి అనే మహిళ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేసు కోవడంతో ఆమెను ఆర్పీఎఫ్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంరక్షించి, ఇటీవల టీపీ స్పార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌లో వసతి కల్పించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్న ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పద్మనాభం మండలంలోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మళ్లీ ఇంటి నుంచి ఎక్కడికీ వెళ్లకుండా కట్టడి చేయాలని ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు.


లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి

సీతమ్మధార: భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత – 2023 పేరు మీద డిసెంబర్ 21న పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించిందని, దానికి రాష్ట్రపతి డిసెంబర్ 25న ఆమోద ముద్ర వేశారన్నారు. ఆ చట్టంలోని సెక్షన్ 106 (1, 2) ప్రకారం యాక్సిడెంట్ కేసుల్లో డ్రైవర్లకు 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం వుందని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. దీనిని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ చట్టం డ్రైవర్లను తీవ్ర అసంతృప్తి, ఆందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు